
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం 5 నవంబరు 2025

రేపు పత్తి మార్కెట్లు బంద్

సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లకు స్లాట్ బుకింగ్స్ వద్దు

గురువారం మార్కెట్ యార్డుకు పత్తి తీసుకొని రావద్దు

మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిన్నింగ్ మిల్ యాజమాన్యాలతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమీక్ష

5

ఆంధ్రజ్యోతి పరిశీలన



అశ్వాపురం మండలం గొల్లగూడెం సీతారామ కెనాల్ వద్ద జాతీయ రహదారి దుస్థితి

అటు ఇటు అయితే..!

అడుగుకో గుంత.. కాస్త అటు ఇటు అయితే ఆపదలో పడాల్సిందే. మనం సక్రమంగా వెళ్తున్నా.. ఆ గుంతల ద్వారా.. ఎదురుగా వచ్చే వాహనాలతో అపాయం ఎదురవుతోంది. సరిగ్గా ఇలాంటి ఘోర ప్రమాదమే సోమవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వద్ద వికారాబాద్ - హైదరాబాద్ హైవే జరిగింది. రహదారిపై ఏర్పడిన ఓ గుంత 19మంది ప్రాణాలను బలిగొంది. అతివేగంగా వచ్చిన ఓ కంకరటిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని పలు రహదారులు కూడా వాహనదారులకు వణుకు పుట్టిస్తున్నాయి. రోడ్లపై పడిన గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి నిత్యం జరుగుతున్నా.. రోడ్లు దెబ్బతిని ఏళ్లల గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాంగం నిర్లక్ష్యానికి తోడు భారీ వర్షాలు మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. వానల ధాటికి అడుగు లోతుకుపైగా గుంతలు పడ్డాయి. జిల్లాలో పలానా రహదారి అనేది లేకుండా.. అన్ని రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. ఉమ్మడి జిల్లాలోని పలు అధ్వాన రహదారులపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన.

వివరాలు 5లో

- రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న భారీ గుంతలు
- దడ పుట్టిస్తున్న ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రహదారులు
- కనీస మరమ్మతులు లేక వాహనదారుల అవస్థలు
- లెక్కలు వేసి ఆ తర్వాత పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి, ఉమ్మడి ఖమ్మం జిల్లా నెట్‌వర్క్)



గుంతలమయంగా పెనుబల్లి మండలంలోని వీఎంబంజర్ రోడ్డు



కారేపల్లి మండలం సీతారాంపురం వద్ద.. దెబ్బతిన్న రోడ్డు



ఖమ్మం - కొత్తగూడెం ప్రధాన రహదారిలో కొణిజర్ల సమీపంలో 'ఇరుకు'గా రోడ్డు..

మెప్మాలో ప్రైవేట్ పెత్తనం!

- వీధి వ్యాపారుల రుణాల్లో అక్రమాలు
- బయటి వ్యక్తుల సిఫార్సులకు నేరుగా ఆన్‌లైన్
- ఆర్పీలను పక్కకు పెట్టడంపై వివాదం



ఆన్‌లైన్ చేయిస్తున్న బయట మహిళ

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో క్షేత్రస్థాయిలో కీలకంగా బాధ్యతలు నిర్వహించే రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లు ఉన్నా కూడా వారిని కాదని ప్రైవేట్ వ్యక్తులు నేరుగా మెప్మా జిల్లా కార్యాలయానికి వెళ్లి వీధి వ్యాపారుల రుణాలను ఆన్‌లైన్ చేయించటం పెద్ద వివాదంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత లక్ష్యాలకు మెప్మాలోని కొందరు ఉద్యోగుల తీరు అక్రమాలకు తెరలేపుతోంది. కేవలం రూ.100, రూ.200 కోసం ప్రధాన మంత్రి స్వనిధి రుణాలను అర్హత లేని వారికి అందిస్తున్నారు. చివరి రికవరీ సమయంలో ఎవ్వరు బాధ్యత తీసుకుంటారనే కనీస విషయాన్ని మెప్మా అధికారులు గాలికొదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి.

వీధి వ్యాపారులను ఆదుకునేందుకు పీఎం స్వనిధి

కొవిడ్ కష్టకాలంలో వీధి వ్యాపారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారికి ఆర్థింగా తోడ్పాటునిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్వనిధి పథకానికి కార్యచరణ చేసింది. వీధి వ్యాపారులై ఉండి కేవలం వారు వ్యాపారం చేసే ఫొటో, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం అందిస్తే వారికి దశల వారీగా రూ.15వేలు, రూ.25వేలు రూ.50వేల వరకు తిరిగి చెల్లింపులను అనుసరించి రుణాలను మంజూరు చేస్తారు. రాష్ట్రంలోనే ఖమ్మం నగర పాలక సంస్థ వీధి వ్యాపారుల రుణాలు మంజూరులో ముందు వరసలో ఉంది.

మెప్మా కార్యాలయానికి ప్రైవేట్ వ్యక్తులు

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో రిసోర్స్ పర్సన్లు ఎంతో కీలకంగా పనిచేస్తున్నారు. ఒక్క ఖమ్మం నగరంలోనే 164మంది వరకు ఆర్పీలున్నారు. పీఎం స్వనిధి నిబంధనల మేరకు ఆర్పీలు తమ పరిధిలోని ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా వీధి వ్యాపారం చేస్తూ ఆర్థిక ఇబ్బందులున్న వారిని గుర్తించి సిఫార్సులు చేయించాల్సి ఉంటుంది. తిరిగి చెల్లింపుల సమయంలోనూ ఆర్పీలు వీధి వ్యాపారుల నుంచి రుణాలను రికవరీ చేయించి బ్యాంకర్లకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆర్పీలకు లక్ష్యాలను ఇచ్చారు. కానీ ఖమ్మం నగరంలోని కొన్ని డివిజన్లలో ఆర్పీలు సిఫార్సులు చేసిన వీధి వ్యాపారుల దరఖాస్తులను మెప్మాలోని కంప్యూటర్ అపరేటర్లు పక్కకు పెడుతున్నారు. ఆదే ప్రాంతంలోని ప్రైవేట్ మహిళలు, వ్యక్తులు నేరుగా మెప్మా కార్యాలయానికి చేరుకుంటున్నారు. మెప్మాలోని (మిగతా 6వ పేజీలో)

విచారణ చేస్తున్నాం..

సావల సుజాత, జిల్లా మిషన్ కో అర్డినేటర్, మెప్మా

కేవలం ఆర్పీల ద్వారానే మెప్మాలో సభ్యుల గుర్తింపు, నమోదు నుంచి రుణాల మంజూరు వరకు జరపాలి. మామిళ్లగూడెంలో ఆర్పీకి తెలియకుండా రుణాలను ఆన్‌లైన్ జరిగిందనే విషయం మా దృష్టికి వచ్చింది. ఆ విషయంపై విచారణ చేస్తాం. మధ్య వర్తులను వీధి వ్యాపారులు నమ్మొద్దు. కేవలం ఆర్పీల ద్వారానే రుణాలు మంజూరవుతాయి.



విద్యుత్‌దీపాల వెలుగులో కూసుమంచి గణపేశ్వరాలయం

కార్తీక పౌర్ణమి వేళలో..

- నేటి ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీకపౌర్ణమి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని శైవ, వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు ప్రారంభం కానున్నాయి. భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేశారు.

వివరాలు : 4లో

వీరుల త్యాగాలు వెలకట్టలేనివి



- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ
- సత్తుపల్లిలో ఉత్సాహంగా జిల్లా మహాసభలు

6



యర్రబోయనపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

భారీ వర్షం.. తడిచిన ధాన్యం

- కల్లూరు మండలంలో వేలాది ఎకరాల్లో పంట నీటిపాలు
- కల్లాలను పరిశీలించిన సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్

కల్లూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షం వేలాది ఎకరాల్లోని ధాన్యాన్ని నీటిపాలు చేసింది. కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీవర్షం పడటంతో వేలాది ఎకరాల్లోని వరి పంట నేలవాలగా.. అరబెట్టిన ధాన్యం రాసులు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక్క యర్రబోయినపల్లిలోనే సుమారు 1,600 ఎకరాల్లో పండిన ధాన్యాన్ని కల్లాలో అరబెట్టగా పూర్తిగా నీటిపాలయ్యాయి. అకస్మాత్తుగా వర్షం రావడంతో పట్టాలు కప్పుకునే సమయం కుడా లేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. లింగాల, చంద్రుపట్ల, చెన్నూరు, కల్లూరులోని శివాలయంలో కూడా అరబెట్టిన ధాన్యం తడిచింది. యర్రబోయనపల్లిలో రైతు పోట్రు అర్జునరావుకు సంబంధించి సుమారు వెయ్యి బస్తాల వడ్లు తడిచినట్టు తెలిసింది. రెండు రోజులుగా వాతావరణం అనుకూలించడంతో యంత్రాలతో వరి కోతలు ముమ్మరమయ్యాయి. ఆ ధాన్యాన్ని అరబెట్టి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు రైతులు సిద్ధమవుతున్న క్రమంలో భారీ వర్షం వారి ఆశలపై నీళ్లు చిమ్మింది. యర్రబోయనపల్లిలో ధాన్యం తడిచిన విషయం తెలుసుకున్న కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, తహసీల్దార్ సాంబశివుడు గ్రామానికి చేరుకుని ధాన్యాన్ని పరిశీలించారు. ఈ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు వారిని వేడుకోగా.. కలెక్టర్‌కు నివేదిక పంపుతామని వారు హామీ ఇచ్చారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

పోట్రు అర్జునరావు, యర్రబోయినపల్లి

సుమారు 30ఎకరాల్లో పండిన సుమారు వెయ్యి బస్తాల ధాన్యం భారీ వర్షంతో తడిసి ముద్దయ్యింది. ఒక్క మా గ్రామ పరిధిలోనే సుమారు 1,600 ఎకరాల్లో యంత్రాలతో కోసిన ధాన్యం ఆరబెట్టి ఉంది. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి. ఈ మేరకు రైతులమంతా కలిసి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయికి వినతి పత్రాలు అందజేస్తాం.



శేషగిరిరావు మల్బరీ తోటలో పట్టుగూళ్లను పరిశీలిస్తున్న పట్టుపరిశ్రమ శాఖ అధికారులు

పట్టుతో అధిక ఆదాయం

20రోజుల్లో రూ.72వేల ఆదాయం పొందిన రైతు

వైరా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మల్బరి సాగుతో పట్టు ఉత్పత్తిలో ఓ రైతు మంచి రాబడి పొందారు. వైరా మండలం రెబ్బవరంలోని రైతు శేషగిరిరావు పట్టుపురుగుల పెంపకం చేపట్టి కేవలం 20రోజుల్లో రూ.72వేల ఆదాయం పొందారు. మంగళవారం పట్టు పరిశ్రమల శాఖ జిల్లా, డివిజన్ అధికారులు ఏ.ముత్యాలు, ఆకుల వేణు, ఏఎస్‌వోలు సీహెచ్.కామేశ్వరరావు, బి.దేవరాజు పట్టు పంటను సందర్శించి పరిశీలించారు. పట్టుపురుగుల పెంపకంలో మంచి రాబడిని సాధించిన శేషగిరిరావును వారు అభినందించారు. రెబ్బవరంలో 12మంది రైతులు 25ఎకరాల మల్బరీ పంటను సాగుచేస్తున్నారు. పట్టుపరిశ్రమ అన్ని పంటల కంటే తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో అధిక ఆదాయం వస్తుందని ముత్యాలు, వేణు తెలిపారు. కొత్తగా పట్టుపురుగుల పెంపకం చేపట్టే రైతులకు ప్రభుత్వం ద్వారా షెడ్ల నిర్మాణానికి జనరల్ రైతులకు రూ.2.25లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2,92,500, మల్బరీ తోట పెంపకానికి జనరల్ రైతులకు రూ.6వేలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.8వేలు ప్రభుత్వం అందిస్తుందని ఆసక్తిగల రైతులు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

రెండేళ్లుగా ఒక్కరూ చేరలే!



ఉద్యోగినుల వసతి గృహం

- సమస్యల వలయంలో ఖమ్మంలోని ఉద్యోగినుల వసతి గృహం
- పరిష్కారంపై దృష్టి సారించని అధికారులు
- ఆర్నెల్ల క్రితం మరమ్మతులు చేసిన ఫలితం శూన్యం

వివరాలు : 4లో



వసతిగృహం మధ్యలో ఉన్న మురికి కాలువ

ఉద్దీపకంతో.. బోధన మెరుగు

- ఐటీడీఏ పీవో రాహుల్
- టీచర్‌గా మారి పాఠాల బోధన



విద్యార్థులతో రాయిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్ధమయ్యే రీతి లో ఉద్దీపకం వర్క్‌బుక్ పాఠాలు చెప్పడంతో వారి విద్యాభ్యాసం కొంత మెరుగుపడిందని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఎర్రబోరు, రా జుపేట జీపీఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీవో స్వయంగా టీచర్ అవతారమెత్తి విద్యార్థుల చేత బోర్డుపై అక్షరమాల, తల్లిదండ్రుల పేర్ల ను రాయించారు. పీఓ అడిగిన ప్రతీ పదాన్ని బోర్డుపై రాయడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్దీపకం వర్క్‌బుక్ అమలుతో గిరిజన చిన్నారుల విద్య బలోపేతం అవుతుందన్నారు. పిల్లలు వర్క్‌బుక్‌లోని పదాలు, కూడిక లు, తీసివేతలు, ఇతర వస్తువుల పేర్లను అర్థం చేసుకొని రాయగలుగుతున్నారన్నారు. కలెక్టర్ వెంట ఎస్సీఆర్పీ గాంధీ, టీచర్లు సాయం కృష్ణయ్య, శోభన్‌బాబు, రమేష్ ఉన్నారు.

పీవో వాహనాన్ని ఢీకొన్న మరో వాహనం

భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఏపీలో ని ఎటపాక గ్రామం వద్ద వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పీవో వాహనం వెనుక డ్యామేజీ కాగా.. వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. దీంతో అదే వాహనంలో పీవో కార్యాలయానికి చేరుకొని విధులకు హాజరయ్యారు.

రామయ్యను దర్శించుకున్న ప్రవాసభారతీయులు

» మారిషస్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ నుంచి 32మంది రాక



రామాలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రవాస భారతీయులు

భద్రాచలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని ప్రవాస భారతీయులు మంగళవారం దర్శించుకున్నారు. 32మంది మారిషస్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ నుంచి వచ్చి తొలుత పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం తమ ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో వారు ఆలయ నిర్మాణం, ప్రాశస్త్యం తదితర వివరాలను తెలుసుకున్నారు. ఇదే సమయంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే పూజలు గురించి కూడా తెలుసుకున్నారు. వీరి వెంట 18వ శతాబ్దంలో ఏపీలోని విశాఖపట్టణం నుంచి మారిషస్‌కు తరలివెళ్లిన ఒక తెలుగు కుటుంబానికి చెందిన ఆర్యనందన అప్పయ్య ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. 1989లో తాను రామయ్యను దర్శించుకోవడం జరిగిందని, నాటికీ నేటికీ ఆలయం ఎంతగానో అభివృద్ధి చెందడం సంతోషదాయకమన్నారు. తమ వెంట మారిషస్‌లోని పరమేశ్వరి ఆనంద నిలయ ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ సత్య కామానంద సరస్వతి స్వామి రావడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా మారిషస్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ నుంచి పర్యాటకులు రావడంతో వారికి పర్యాటక పోలీసులు సహాయ, సహకారాలు అందించారు.

రేగళ్ల రేంజ్ అడవుల పరిశీలన



అడవుల గురించి తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

ఆళ్లపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి మండలం, రేగళ్ల రేంజ్, మర్కోడు సెక్షన్‌లోని దట్టమైన అడవి ప్రాంతాన్ని మంగళవారం జిల్లా ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ పరిశీలించారు. రేగళ్ల రేంజర్ జశ్వంత్ ప్రసాద్ ఆధ్వర్యంలో అటవీ అటాచ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ట్రైనీ కలెక్టర్ అడవులపై అవగాహన పొందారు. అడవిలో పర్యటించి ట్రెక్కింగ్, జీవవైవిధ్యం, అడవుల, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణపై అధ్యయనం చేశారు. అనంతరం మర్కోడు జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు నీలమయ్య, భాస్కర్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు వెళ్లాలని మందలించినందుకు..
మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

» గుండాల మండలంలో ఘటన

గుండాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లి చదువుకొమ్మని తల్లిదండ్రులు మందలించినందుకు మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో మంగళవారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. మండలంలోని చీమలగూడెం గ్రామానికి చెందిన ఈసం ప్రకాష్(16) గుండాలలోని గిరిజన కళాశాల వసతిగృహంలో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ప్రకాష్ మళ్లీ కాలేజీకి వెళ్లలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పలుమార్లు కళాశాలకు వెళ్లాలని హెచ్చరించారు. అయినా కాలేజీకి వెళ్లకపోవడంతో సోమవారం ఉదయం వారు మరోసారి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రకాష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుండాల పీహెచ్‌సీకి తరలించి.. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సైదా రవూఫ్ తెలిపారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు
దుమ్ముగూడెం విద్యార్థుల ఎంపిక



ఎంపికైన దుమ్ముగూడెం విద్యార్థులు

దుమ్ముగూడెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు దుమ్ముగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. జోర్నకల్‌లో ఈనెల 2,3,4 తేదీల్లో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ క్రీడాపోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో రెండు బంగారు, ఒక వెండి పతకాలు దక్కాయి. భద్రాచలం ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి కరుకు ధనుష్, ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.నౌషిక్‌లు బంగారు పతకాలు సాధించారు. వీరివురూ త్వరలో అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే దుమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పొడకలపల్లి అక్షిత్ దివాకర్ వెండి పతకం సాధించాడు. వీరిని ఎంఈవో సమ్మయ్య, పీఈటీ చైతన్యలు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

దమ్మపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి దమ్మపేట జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భవాని జరిమానా, శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. దమ్మపేట పోలీసులు తనిఖీలలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 16 మందిపై కేసులు నమోదు చేయగా, వారిపై దమ్మపేట కోర్టులో మెజిస్ట్రేట్ భవాని మంగళవారం విచారించి 16మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.1000జరిమానా విధించారు. ఒక వ్యక్తి మాత్రం జరిమానాతో పాటు నాలుగురోజుల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్‌ఐ తెలిపారు.

వైరా బస్టాండ్‌లో రూ.50వేల చోరీ

వైరా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ ప్రయాణీకురాలి బ్యాగ్‌లోని రూ.50వేల చోరీ జరిగింది. తాటిపూడి గ్రామానికి చెందిన ఓ బ్యాంకు సర్వీస్ పాయింట్ నిర్వాహకురాలు నాగలక్ష్మి వైరాలో ఒక బ్యాగ్‌లో ఖమ్మం వెళ్లేందుకు బస్సు ఎక్కింది. అదే బ్యాగ్‌లో రూ.50వేల నగదుతో ఉన్న చిన్న పర్సుని ఉంచుకుంది. అయితే ఆచిన్న పర్సుతో సహా రూ.50వేలు బస్టాండ్‌లో కాజేశారు. పర్సులోని నగదును కాజేసి ఖాళీ పర్సును గుర్తుతెలియని దుండగుడు మరో బస్సులో వదిలేశాడు. ఆబస్సు కండక్టర్ ఆపర్సును పరిశీలించి దానిలో ఉన్న సెల్‌ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయడంతో నాగలక్ష్మికి చెందిన రూ.50వేలు చోరీకి గురైనట్లు బయటపడింది. సదరు బాధితురాలు వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కార్తీక పౌర్ణమి వేళలో..

» నేటి ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
» ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కైకొండాయిగూడెం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శివ కేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని శైవ, వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి.బుధవారం శివాలయాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు ప్రారంభం కానున్నాయి. పూజలు, దానాలు, జపాలు, ఉపవాస దీక్షలు చేసే వారికి పుణ్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. ప్రత్యేకించి దీపారాధన సర్వశ్రేష్టమైనదిగా, దీపదానం చేస్తే సకల పాపాలు తొలగి మోక్షం కలుగుతుందని భక్తులు భావిస్తారు. మహిళలు తులసి చెట్టు వద్ద 365 వత్తులను నేతితో తడిపి దీపం వెలిగిస్తారు. శివారాధన చేసే భక్తులు రోజంతా ఉపవాస దీక్షలు చేస్తూ ప్రదోషకాలంలో స్వామిని అభిషేకించి మారేడు దళాలతో పూజిస్తారు. జిల్లాలోని కూసుమంచి, తీర్దాల, తోపాటు పలు ఆలయాలు, నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, బ్రాహ్మణబజారు శివాలయం, ఎస్పీ ఆఫీసు రోడ్డులోని శివాలయం, ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయం తోపటు వివిధ ఆలయాలలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలకు భక్తులు వేలాదిగా తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా, కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం నగరంతో పాటు వివిధ ప్రాంతాలలో మార్కెట్లు కిటకిటలాడాయి. ఉసిరి కొమ్మలు, వత్తులు, పూలు, పండ్లు, ప్రమిదలు, ఇతర పూజా సామగ్రి కొనుగోలుతో సందడిగా మారాయి.





నగరంలో పూజ సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



కూసుమంచిలో...

కూసుమంచి: కార్తీకపౌర్ణమిని భక్తులు బుధవారం జరుపుకోనున్నారు. ఈసందర్భంగా కూసుమంచిలోని ప్రసిద్ధ శివాలయం కిటకిటలాడనుంది. ఆలయ ధర్మకర్తలమండలి ఆధ్వర్యంలో అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని, మహాశివుని అలంకరించారు. కూసుమంచి పరిసరప్రాంతాలనుంచే కాకుండా ఖమ్మం నగరం మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలనుంచి పెద్దఎత్తున తరలివచ్చిపూజలు మహాశివుని దర్శించుకోనున్నారు. అదే విధంగా జక్కేపల్లిలోని బాలకోటేశ్వర స్వామి ఆలయం కూడా కిటకిటలాడనుంది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మహాశివుని దర్శించుకోవాలని ఈవో శ్రీకాంత్ కోరారు.

యథావిధిగా జిన్నింగ్ మిల్లులను కొనసాగించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లులు యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యం ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబరు 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ పిలుపునిచ్చిన బంద్ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిన్నింగ్ మిల్లులను బంద్ చేయరాదని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మిల్లులను యథాతదంగా కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఎల్1, ఎల్2, ఎల్3 రకాల సమస్యలు లేకపోవడంతో బంద్ అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతులు వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పత్తి కొనుగోలు, ప్రాసెసింగ్ ప్రక్రియలో అంతరాయం కలగకుండా అన్ని మిల్లులు నిరాటకంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు పత్తి తేమ 12 శాతం మించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించి పత్తి నాణ్యతను కాపాడే విధంగా సూచనలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మార్కెటింగ్ యార్డులలో పత్తి ఆరబెట్టడానికి తగిన సౌకర్యాలు కల్పించి, పత్తి తడివేయకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి రైతులు మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులు సమయానికి పత్తిని మార్కెట్‌కు తీసుకురావడంతో పాటు మిల్లులు నిరాటకంగా కొనుగోలు చేయడం ద్వారా జిల్లా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

» ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు కళాశాలలకు తాళాలు
» ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీటెక్, డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేంత వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, బీఈడీ, పాలిటెక్నికల్, పీజీ కళాశాలలకు తాళాలు వేసి బంద్ కొనసాగిస్తామని ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు పేర్కొన్నాయి. మంగళవారం నగరంలోని శ్రీచైతన్య కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పలువురు ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మా కళాశాల యజమానులు మల్లెంపాటి శ్రీధర్, గుండాల కృష్ణ, నవీన్‌బాబు, రాజేశ్వరరావు, కిరణ్‌లు హాజరై మాట్లాడారు. పేద మధ్య కుటుంబాలకు చెందిన విద్యార్థులకు మాజీ సీఎం రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన ఫీజురియింబర్స్‌మెంట్ పథకంతో ఎందరో పేద విద్యార్థులకు చదువుకోని, నేడు అత్యున్నతమైన స్థితిలో ఉన్నారని అన్నారు. అలాంటి పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కళాశాలల నిర్వహణకు యాజమాన్యాలు ప్రతి నెల నెలా అప్పులు తెచ్చి అప్పులపాలు కావలసిన దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కళాశాలలకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించేంతవరకు కళాశాలల బంద్ నిరవధికంగా కొనసాగుతుందన్నారు. ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలకు ప్రభుత్వం అండగా నిలచి ఆర్థిక భరోసా కల్పించాల్సింది పోయి కక్ష్యసాధింపునకు దిగడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలి కోరారు.



మాట్లాడుతున్న కళాశాల యజమానులు

రెండేళ్లుగా ఒక్కరూ చేరలే!

» సమస్యల వలయంలో ఖమ్మంలోని ఉద్యోగినుల వసతి గృహం
» ఆర్నెళ్ల క్రితం మరమ్మతులు చేసినా ఫలితం శూన్యమే
» పరిష్కారంపై దృష్టి సారించని అధికారులు



ఉద్యోగినుల వసతి గృహం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న ఉద్యోగినుల వసతి గృహంలో సుమారు రెండేళ్లుగా ఒక్క అడ్మిషన్ లేకుండానే అధికారులు వసతి గృహన్ని కొనసాగిస్తున్నారు. 2004, జనవరి 31న అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వసతి గృహన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 2024, సెప్టెంబరు వరకు 30 నుంచి 40 మంది వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగినులు ఇందులో ఆశ్రయం పొందారు. ఒక్కొక్కరి నుంచి రూ. 1,500 చొప్పున వసూలు చేసి వారికి ఆశ్రయం కల్పించారు. అయితే గత ఏడాది భారీ వర్షాల కారణంగా మున్నేరుకు వరద వచ్చి.. వసతి గృహం పూర్తిగా మునిగి కరెంట్, డ్రెయినేజీ పైప్‌లైన్‌లు, వసతి గృహం గోడలు పూర్తిగా పాడైపోయాయి. దీంతో కలెక్టర్ నిధులతో సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి మరమ్మతులు చేశారు. మరమ్మతులు పూర్తి చేసి 6 నెలలు గడిచినా.. అధికారులు వసతి గృహంలో అడ్మిషన్లు లేకుండానే సిబ్బందిని కొనసాగిస్తున్నారు. వాస్తవానికి వసతి గృహంలో ఉన్న రెండు ప్రధాన మురికి కాలువలకు తోడు దగ్గరలోనే రెండు వైన్‌షాపులు, వసతిగృహం ఎదురుగా చేపల మార్కెట్ ఉండడంతో.. హాస్టల్‌లోకి వచ్చేందుకు ఉద్యోగినులు భయపడుతున్నట్లు తెలిసింది. అన్ని వసతులతో.. అతి తక్కువ రేట్లతో అందుబాటులో ఉండాల్సిన వసతిగృహం.. ప్రస్తుతం అడ్మిషన్లు లేక బోసిపోతోంది. అధికారులు అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నగర నడిబొడ్డులో ఉన్న వసతి గృహం అడ్మిషన్లు లేకపోవడానికి అధికారుల తప్పిదమా!? లేక వసతుల కారణమా!? తెలియని పరిస్థితి నెలకొంది.

వసతి గృహంలోనే ప్రధాన మురుగు కాలువ

నగరంలోని బస్సు డిపో రోడ్డులో గల ప్రధాన కూరగాయల ప్రాంగణం రోడ్డులో ఉన్న ఉద్యోగినుల వసతిగృహంలో నగరంలో నుంచి వెళ్లే ప్రధాన మురుగు కాలువ ఉండడంతో.. ఓ చిన్న వర్షం వచ్చినా, మున్నేరుకు వరద వచ్చినా చుట్టూ నీరు చేరుతోంది. ఫలితంగా వసతి గృహంలోని వంట గదులు, డైనింగ్ హాల్‌తో పాటు గదులన్నీ మురుగు నీటితోనే నిండి ఉంటాయి. వసతి గృహానికి రెండు వైపులా మురుగు కాలువ ఉండడంతో.. మురుగు కంపుతో ఇబ్బందులు తప్పవు. ఇంత ఖర్చు చేసినా.. అధికారులు మురుగు నుంచి ప్రత్యామ్నాయం చూపకుండా అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇస్తే.. తాము ఇబ్బందులు పడుతామనే ఆలోచనతో అడ్మిసన్లు తీసుకునేందుకు ఉద్యోగినులు ముందుకు రావడం లేదని సమాచారం. మురుగు కాలువపై కనీసం మూతలేకుండా ఉండడంతో.. మరీ కంపు కొడుతోంది. నలుగురు రెగ్యులర్ సిబ్బంది ఉన్న వసతి గృహన్ని అడ్మిషన్లు లేకుండా చేశారంటే.. అది కేవలం జిల్లా అధికారులు తప్పిదమే. మురుగు కాలువకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపి.. మురుగు రాకుండా, వర్షాకాలం వరదలు రాకుండా చేస్తే అడ్మిషన్లు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు వసతి గృహంలో సమస్యలపై దృష్టి సారించి.. సమస్యలను పరిష్కరిస్తే వసతిగృహం అందుబాటులోకి వచ్చి ఎందరో ఉద్యోగినులకు ఉపయోగపడుతుంది.



వసతిగృహంలో చెత్తాచెదారం

స్టేషన్‌పై దాడియత్నం ఘటనలో నలుగురి అరెస్ట్

జూలూరుపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌పై దాడికి ప్రయత్నించిన సంఘటనలో నలుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ బాదవత్ రవి తెలిపారు. జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన యువకుడు అన్నారుపాడుకు చెందిన యువతి ప్రేమించుకుని అక్టోబరు 29న ప్రేమ వివాహం చేసుకుని తమకు రక్షణ కల్పించాలని 30న జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు బంధువులతో కలసి అదే రోజు రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. బంధువులతో కలసి తల్లిదండ్రులు తమ కుమార్తెను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీస్‌స్టేషన్‌పై దాడికి ప్రయత్నించారు. ఈ సంఘటనలో అన్నారుపాడు గ్రామానికి 14 మందిపై కేసు నమోదు చేశారు. కాగా వారిలో బానోత్ సురేష్, రమేష్, లకావత్ రోజా, బాదావత్ జవహర్‌లాల్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని మిగిలిన 10 మందిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

మావోయిస్టుల డంప్ గుర్తింపు

చర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో మావోయిస్టు పార్టీకి చెందిన డంప్‌ని మంగళవారం డీఆర్‌జీ బలగాలు గుర్తించాయి. ఈ క్రమంలో మావోయిస్టులకు చెందిన తుపాకులు, ఇతర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుకుమా జిల్లా గోమ్‌గూడ అడవుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన డంప్ ఉన్నట్లు అందిన సమాచారంతో అక్కడికి చేరుకున్న బలగాలు భూమి సొరంగంలో ఉన్న డంప్‌ని గుర్తించాయి. అందులో 17తుపాకులు, బీజీఎల్స్ లాంచర్లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, కానీ 17తుపాకులు పనిచేయడం లేదని పోలీసులు తెలిపారు. మావోయిస్టులు ఆయుధాలను ఈ సొరంగంలో తయారు చేసేవారని, బలగాల రాకను గమనించి పరారయ్యారని సుకుమా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మావోయిస్టులు లొంగిపోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కూల్‌డ్రింక్స్ దుకాణాలపై దాడులు



పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆళ్లపల్లి/గుండాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుండాల మండలంలో మంగళవారం జిల్లా ఆహారభద్రత అధికారులు పలు దుకాణాలపై దాడులు చేశారు. ప్రధానంగా కూల్‌డ్రింక్స్ సప్లై చేస్తున్న దుకాణంతో పాటు, చిన్న చిన్న దుకాణాల్లో కూల్‌డ్రింక్స్ అమ్మకాలు విక్రయిస్తున్న దుకాణాల్లో తనిఖీ చేశారు. గుండాల, ఆళ్లపల్లి మండలంలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు రావడంతో జిల్లా ఆహార భద్రత అధికారి శరత్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. తనిఖీల్లో కాలం చెల్లిన, కొద్దిరోజుల్లో కాలం చెల్లబోతున్న వివిధ రకాల డ్రింక్స్‌ను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా లభ్యమైన ఓ కూల్ డ్రింక్‌ను నమూనా కోసం సేకరించారు. నెల రోజుల తరువాత కాలం చెల్లినట్లుగా పరీక్షలో తెలితే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారి శరత్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. అనంతరం పలు కిరాణా, బేకరి షాపుల్లో తనిఖీలు చేపట్టి తప్పనిసరిగా దుఖాణాదారులు అనుమతి తీసుకోవాలని సూచించారు.

● తూతుమంత్రంగా తనిఖీలు..?

మంగళవారం ఆహార భద్రత అధికారులు కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ దుకాణాల్లో చేసిన దాడులు తూతుమంత్రంగా చేశారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో పలు దపాలుగా కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ విక్రయించినట్లు ఆంధ్రజ్యోతిలో రావడంతో, గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రికి ఓ డీసీఎం వ్యాన్‌లో గుండాల మండలం, దామరతోగు(పులుసుబొంత) అడవుల్లో వందల సంఖ్యలో కూల్ డ్రింక్ బాటిల్స్ పారబోశారు. అసలు ఆ డ్రింక్ బాటిల్స్ ఎక్కడివి, అక్కడ ఎందుకు పడేశారు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లావా, ములుగు జిల్లా అనే కోణంలో ఆహారభద్రత అధికారులు ఆరా తీయక పోవడం గమనార్హం. కాగా అప్పట్లో ఓ ప్రజాప్రతినిధి అండ, అధికారుల పోత్సాహంతో దాడులు నిలిపివేసినట్టు విశ్వసనీయ సమాచారం. కాగా ఈసారి నమూనా పరీక్ష పేరుతో పక్కదారి పట్టిస్తారంటూ పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలని కూల్‌డ్రింక్ ప్రియులు అంటున్నారు.

పత్తి రైతు కష్టాలు..

» నల్ల పత్తిని కొనుగోలు చేయమంటున్న సీసీఐ
» ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటున్న అన్నదాతలు



ఖమ్మం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంచిగా ఉన్న పత్తిని మాత్రమే కొనగోలు చేస్తాం...కొద్దిగా నల్లబారినా సరే ఆపత్తిని కొనగోలు చేయం...మార్కెట్‌లో విక్రయించుకోవాల్సిందేనని తెగేసి చెబుతున్న సీసీఐ నిర్వాహకులు..దీంతో వర్షాలకు పంట చేలో పత్తి నల్లబడితే దానికి మీమేం చేయాలో మీరే చెప్పాలి.. కొద్దోగొప్పో నల్లబారితే ఎందుకు కొనుగోలు చేయరు. జిన్నింగ్ మిల్లులో కొనుగోలు చేయకపోతే మీమేం కావాలని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం రూరల్ మండలంలో మొత్తం 3 సీసీఐ కేంద్రాలను నవంబర్ 20వ తేదీన ఏర్పాటు చేయడం జరిగింది. గుర్రాలపాడు, తల్లంపాడు, పొన్నేకల్లు గ్రామాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు ఖమ్మం రూరల్ మండలంతో పాటు ముదిగొండ, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, రఘునాదపాలెం మండలాల నుంచి రైతులు పత్తిని తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. అయితే ఏడాది ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు చేసే పత్తికి క్వింటాకు రూ.8,110 మద్దతు ధర కేటాయించింది. తేమశాతం 8 నుంచి 12 లోపు ఉండాలి. అదేవిధంగా ఒక్కో రైతు నుంచి ఎకరానికి 7 క్వింటాల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఈ సీసీఐ కేంద్రాలలో ఇప్పటి వరకు మొత్తం 193 మంది రైతుల నుంచి సుమారు 3,900 క్వింటాల పత్తిని సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

నల్లబారిన పత్తిని
తిరస్కరిస్తున్న నిర్వాహకులు

ప్రభుత్వం సాధ్యమైన మేర ఎలాంటి పత్తినైనా కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని చెబుతుంటే సీసీఐ నిర్వాహకులు మాత్రం కొద్దిగా నల్లబడిన పత్తిని కూడా కొనకుండా నిర్దాక్షిణ్యంగా వెనక్కు పంపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించినా అధిక వర్షాలకు పంట చేలో పత్తి నల్లబడితే దానికి మేము ఏం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి పత్తిని కూడా కొనుగోలు చేయకపోతే మిము ఎక్కడ అమ్ముకోవాలని అన్నదాలు విలపిస్తున్నారు. ఈ ఏడాది పడిన వర్షాలకు అసలు పత్తి దిగుబడి లేక పెట్టిన పెట్టుబడులు రాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న అన్నదాతలను సీసీఐ కేంద్రాల నిర్వాహకులు పత్తి వెనక్కు పంపించడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని రకాల పత్తిని కొనుగోలు చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

పత్తిని కొనుగోలు చేశాం
● ఆంజనేయులు, మార్కెట్ అధికారి

యాలాద్రి తీసుకువచ్చిన పత్తి నల్లబారింది. కావునా నల్లబారిన దానిని వేరు చేసి తీసుకురమ్మని చెప్పాం. సాయంత్రానికి తీసుకురాగా వెంటనే కొనుగోలు చేయడం జరిగింది. తేమశాతం పోగా క్వింటాకు రూ.7,735 ధర చొప్పున మొత్తం 4 క్వింటాలు అయింది. క్వాలిటీ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయడం లేదు. పత్తి విక్రయించిన రైతులకు మూడు రోజుల్లో వారి ఖాతాలో నగదు జమ అవుతుంది.

మార్కెట్లో అమ్ముకోమని వెనక్కు పంపించారు : రైతు యాలాద్రి

నేను 3 ఎకరాల్లో ఈ ఏడాది పత్తి పంట సాగుచేశాను. ఎకరానికి రూ.40 వేల చొప్పున రూ.120 వేలు పెట్టుబడి పెట్టాను. అందులో మొత్తం దిగుబడి వచ్చింది కేవలం 10 క్వింటాలు మాత్రమే. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అట్టి పత్తిని గుర్రాలపాడు పరిధిలోని జిన్నింగ్ మిల్లుకు కిరాయి ఆటోలో తీసుకువచ్చాను. నిర్వాహకులు నా పత్తి నల్లబారింది దానిని మేము కొనుగోలు చేయం వెళ్లి ఖమ్మం మార్కెట్‌లో అమ్ముకోమని తెగేసి చెప్పారని రైతు పేర్కొన్నాడు. తరువాత మార్కెట్ అధికారి చొరవతీసుకుని నల్లపత్తిని వేరు చేసి తీసుకురమ్మన్నారు.



జిన్నింగ్ మిల్లు ఎదుట నిరసన తెలుపుతున్న రైతు యాలాద్రి



కొణిజర్ల పోలీసుస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు



కూసుమంచి మండలం మల్లాయిగూడెం-తాళ్లగడ్డతండ వద్ద పాలేరు వరద నీటికి కొట్టుకు పోయిన రహదారి



ప్రమాదాలకు కారణమవుతున్న ఖమ్మంపాడు వద్ద మూలమలుపు



అశ్వారావుపేట : నారంవారిగూడెం సమీపంలో కోతకు గురైన బీటీ రోడ్డు

కొణిజర్ల సమీపంలో జాతీయ రహదారిపై..



రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న భారీ గుంతలు

దడ పుట్టిస్తున్న ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రహదారులు

కనీస మరమ్మతులు లేక వాహనదారుల అవస్థలు

లెక్కలు వేసి ఆ తర్వాత పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

అటు ఇటు అయితే..



కరకగూడెం : పద్మాపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

సత్తుపల్లి : గుంతలమయంగా వీఎం బంజర్ వద్ద జాతీయ రహదారి





ఇల్లెందు : పెంజరమడుగు వద్ద వర్షాలకు ఏర్పడిన గుంతలు



కారేపల్లి : గాంధీనగరం రైల్వేగేటు వద్ద ఇబ్బందికరంగా గుంతలు

చర్ల మండలం రాళ్లగూడెం వద్ద..





పడమట నర్సాపురంలో రాష్ట్రీయ రహదారి గుంతల మయంగా..

60కి.మీ ప్రయాణానికి 2 గంటలకుపైగా సమయం..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నుంచి ఖమ్మం వరకు 60 కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతోందంటే ఆ రహదారి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఆయా గుంతల్లో పడి పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కొత్తగూడెం-ఇల్లెందు ప్రధాన రహదారితోపాటు ఇల్లెందు -ఖమ్మం మెయిన్‌రోడ్డుపై పడిన గుంతలు ప్రయాణికులకు నరకాన్ని చూపుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, ఉమ్మడిఖమ్మం జిల్లా నెట్‌వర్క్)

ఉమ్మడి జిల్లాలోని పలు రహదారులు ప్రజలకు దడ పుట్టిస్తున్నాయి. ఇటు పాలేరు నుంచి సత్తుపల్లి వరకు.. అటు అశ్వారావుపేట నుంచి ఇల్లెందు, భద్రాచలం నుంచి మధిర వరకు ఇలా ఏ రహదారి చూసినా గుంతలమయమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత వారోత్సవాలు పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు.. మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని రోడ్ల మరమ్మతులు, వంతెనల వెడల్పు డేంజర్ పాయింట్లవద్ద సరైన జాగ్రత్తలు తీసుకోవంలేదు. ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడే.. అధికారులు హడావుడి చర్యలు చేపట్టడం తప్ప శాశ్వత పరిష్కార మార్గాలు చూడటం లేదు. ఒక్క జాతీయ రహదారులే కాదు.. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల డేంజర్‌స్పాట్లుగా మాటు వేసి ఉం టున్నాయి. అధిక లోడు వాహనాలు, అతివేగం కారణంగా ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు మూలమలుపులు, ఇరుకైన వంతెనలు కూడా మృత్యుఘోషకు కారణమవుతున్నాయి. జిల్లాలో గ్రానైట్‌లారీలతోపాటు టిప్పర్లు విశాఖ, కాకినాడ, మచిలీపట్నం ఓడరేవుల నుంచి సరుకు దిగుమతి, ఎగుమతుల కోసం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

● వైరా నియోజకవర్గం మీదుగా ఉన్న పలు రహదారులపై ప్రమదాలు పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఖమ్మంనుంచి వైరా మీదుగా వెళ్లే జాతీయ రహదారి గుంతల మయమైంది. తనికెళ్ల నుంచి వైరా వరకు అడుగుకో గుంత ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొణిజర్ల పోలీసుస్టేషన్ సమీపంలో ఏర్పడిన లోతైన గుంతల వద్ద వాహన దారులు ప్రమదాల బారిన పడుతున్నారు. ఇటీవల కొణిజర్ల మండలం సింగరాయపాలేనికి చెందిన ఓ వ్యక్తి బైకుపై వెళుతూ కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. కొణిజర్ల సమీపంలోని బోనకల్ బ్రాంచికెనాల్ కాలువపై వంతెన ఇరుకుకావడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వెళ్లే పరిస్థితి లేదు. కొణిజర్ల మండలం పల్లిపాడు నుంచి ఏన్కూరుమీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది.

● సత్తుపల్లి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో రహదారులు ప్రమాదాలకు నిలాయాలుగా మారాయి. సత్తుపల్లి, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో పలు రహదారులు, బ్రిడ్జిలు వాహనదారులకు దడ పుట్టిస్తున్నాయి. జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరుగుతన్నా అధికారులు నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతు న్నారన్న విమర్శలున్నాయి. తల్లాడ మండలం అంజనాపురం నుంచి మల్సార్ తండా వరకూ జాతీయ రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రామచంద్రరావు బంజర్ సమీపంలో, సత్తుపల్లి పట్టణంలోనూ రోడ్డు కుంగింది. సత్తుపల్లి-కిష్టారం మధ్య వై-జంక్షన్ సమీపంలో అనేక ప్రమాదాలు జరిగి పెద్ద సంఖ్యలలో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పోలీసు, ఆర్‌అండ్‌బీ, రవాణా శాఖా, సింగరేణి అధికారులు సంయుక్తంగా గతంలో ఈ ప్రాంతాన్ని పరిశీలించి బ్లాక్ స్పాట్‌గా గుర్తించి చేతులు దులుపుకున్నారు. సత్తుపల్లి-తాళ్లమడ మధ్య తమ్మిలేరుపై దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి ఇరుకుగా మారింది. సత్తుపల్లి నుంచి వేంసూరు రోడ్డులో ఎన్టీఆర్ నగర్ వరకూ, సత్తుపల్లి-సిద్దారం రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరిగుతున్నాయి. కల్లూరు-కప్పలబంధం మధ్య ఎన్నెస్పీ కాలువపై వంతెన ప్రమాదకరంగా ఉంది. కల్లూరు నుంచి గోపాలదేవబోయినపల్లి రహదారి గుంతల మయంగా ఉంది. వీఎం బంజర్‌లోని ఆయిల్ బంక్ వద్ద రహదారి ప్రమాదకరంగా ధ్వంసమైంది. లంకాసాగర్, టేకులపల్లి-తాళ్లపెంట, ఉప్పలచెలక-భ

● పాలేరు నియోజకవర్గంలోని పలు రోడ్లు గుంతలమయమయ్యాయి. కూసుమంచి మండలంలోని మల్లాయిగూడెం నుంచి తాళ్లగడ్డతండాకు వెళ్లే రహదారి గత ఏడాది వరదలకు కొట్టుకుపోగా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు స్వచ్ఛందంగా బాగుచేసుకున్నారు. కానీ ఈఏడాది వరదలకు మళ్లీ కొట్టుకపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూసుమంచి నుంచి పోచారం వెళ్లే 9కిలోమీటర్ల రోడ్డులో మొత్తం 55 మలుపులున్నాయి. దారిపొడవునా గ్రానైట్ క్వారీల గుంతులు, వ్యవసాయ బావులుఉండటంతో వాహనదారులు భయపడుతున్నారు. పాలేరు- మరిపెడ బంగ్లా రహదారి గుంతలమయమైంది. నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం-రాయిగూడెం రహదారి పొడవున మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి గుంతలు పడింది. దీంతో వాహనదారులు రాత్రివేళల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. ఖమ్మం-మహబూబాబాద్ రహదారిలో కాచిరాజుగూడెం వద్ద రెండు మూల మలుపులు, తల్లంపాడు, మద్దులపల్లి వద్ద మూలమలుపులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

వన్నపాలెం, ముత్తగూడెం-కొత్తకారాయిగూడెం రహదారులు పెద్ద గుంతలలో ప్రమాదకరంగా మారాయి.

● మధిర పట్టణంలోని శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న యూటర్న్ ప్రమాదకరంగా ఉంది. అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు, వేగ నిరోధకాలను ఏర్పాటు చేయలేదు. నాలుగు నెలల క్రితం ఓ యువకుడు చనిపోగా అంతకుముందు కూడా పలువురు మృతిచెందారు. మధిర మండలం ఇల్లూరు వద్ద కల్వర్టు దెబ్బతిని రెండేళ్లు కావస్తున్న మరమ్మత్తులు చేయలేదు. ఖమ్మంపాడు ఊరు ముందు ఉన్న మూల మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్న ఎటువంటి హెచ్చిరక బోర్డు ఏర్పాటు చేయలేదరు. బోనకల్, చిరునోముల మధ్యలో సాగర్ కాలువ పైనున్న కల్వర్టు ఇరుకుగా ప్రమాదరంగా ఉంది.

● కొత్తగూడెం డివిజన్ పరిధిలో సెప్టెంబరు నాటికి వర్షాల కారణంగా 42 ప్రాంతాల్లో 149.60 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్టుగా నివేదికలు ఇచ్చారు. వాటికి తాత్కలిక మరమ్మతుల కోసం రూ.3.80 కోట్లు ఖర్చు కానుండగా.. రూ. 43.60 కోట్లు పూర్తిస్థాయిలో నిర్మాణానికి అవసరం అని పేర్కొన్నారు. అంతవరకూ బాగానే ఉన్నప్పటికీ .. తాత్కలికంగా గుంతల్లో తట్టెడు మట్టి పోసే దిక్కులేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

● జూలూరుపాడు మండలపరిధిలోని వినోభానగర్ నుంచి కొమ్ముగూడెం వరకు 12 కిలోమీటర్ల మేర రాష్ట్రీయ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వినోభానగర్, జూలూరుపాడు, సాయిరాం తండా, పడమటనర్సాపురం, మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం తదితర గ్రామాలలో రహదారులదీ అదే పరిస్థితి.

● అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపునకు వెళ్లే రహదారి పైనా పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. నారంవారిగూడెం సమీపంలో బీటీ రోడ్డు కోతకు గురై వాహనాలు రాకపోకలకు సాగించే పరిస్థితి లేదు. అశ్వారావుపేట -వాడొగ్గుగూడెం రోడ్డు, వినాయకపురం-దబ్బతోగు రహదారుల్లోనూ గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. దమ్మపేట నుండి పాల్వంచ ప్రదాన రహదారి నిండి ఎక్కడ చూసినా గోతులే కనిపిస్తున్నాయి. మాదారం-అన్నపురెడ్డిపల్లి రహదారి, ములకలపల్లి-వెంకటాపురం రహదారి అధ్వాన్నంగా ఉంది. చంద్రుగొండ మండలంలో చంద్రుగొండ-గురవాయిగూడెం రహదారి, చంద్రుగొండ-సీతాయిగూడెం వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అన్నపురెడ్డి మండల కేంద్రం నుంచి కొత్తగూడెం, పాల్వంచ వెళ్లే రహదారి ఎక్కడ చూసిన గోతులే.

● ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి, కామేపల్లి మండలాలలో రహదారులు అధ్వానంగా మారాయి. కామేపల్లి పెంజరల్లమడుగు కొత్తలింగాల వద్ద బీటీ రోడ్డు కుంగిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.

● భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రహదారి అస్తవ్యస్తంగా ఉంది. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డులో అన్ని గుంతలే. ఈ రహదారిలో వెళ్లే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం ఐఏఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా ఈ దుస్థితేంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాచలం- చర్ల మార్గంలో గురుకుల పాఠశాల వద్ద, నన్నపనేని మోహన్ జడ్పీ స్కూల్ ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇసుక లారీల రాకపోకలతో చర్ల మండలం పర్ణశాల రాళ్లగూడెం నుంచి ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. ఇటీవల తూతూ మంత్రంగా మరమ్మతుల చేసి చేతులు దులుపుకొన్నారు.

● మణుగూరు పట్టణ ప్రాంతంలోని సురక్షా బస్టాండ్ నుంచి, ఓల్డ్ సీఎస్‌పి, సివిల్ ఆఫీసు కనకదుర్గా గుడి, రామానుజారం దిగువ ప్రాంతం, సింగరేణి చెక్ పోస్టు ఏరియా, సాంబాయిగూడెం, బీటీపీఎస్ నుంచి పినపాక వరకు ప్రతి గ్రామంలో అడుగడుగునా గుంతల మయంగా మారింది. కరకగూడెం మండలంలోని పలు రహదారులు అధ్వారంగా మారాయి. మణుగూరు వెళ్లే ప్రధాన రహదారి సమత్ భట్టుపల్లి పంచాయతీ బూడిదవాగు ప్రవాహానికి రహదారి కోతకు గురైంది. ఈ రహదారులపై మేడారం, వరంగల్, హైదరాబాద్, కరింనగర్ వైపు వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం సాగిస్తుంటారు. ఆళ్లపల్లి, గుండాల మండలాలను అనుసంధానం చేసే పలు రహదారులు గుంతల మయంగా మారింది. అనంతోగు నుంచి గుండాల క్రాస్ వరకు సుమారు 6 కిలోమీటర్లు ఉన్న ఈ ఈ మార్గంలో భద్రాద్రి కొత్తగూడెం, భద్రాచలం, ఏపీ నుంచి ములుగు జిల్లా, మేడారం వెళ్లేవారికి, ఆళ్లపల్లి మండల వాసులకు ఇల్లెందు, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు వెళ్లేందుకు దగ్గరగా ఉంటుంది.

సత్తుపల్లి: అంజనాపురం-మల్సార్ తండా వరకూ జాతీయ రహదారిపై పెద్ద గుంతలు



క్రీడా సంఘాల వివరాలు తెలపండి

డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హైదరాబాద్ వారి ఆదేశానుసారం జిల్లాలోని క్రీడా సంఘాలు తమ అసోసియేషన్ వివరాలు ఈనెల 6కల్లా జిల్లా క్రీడల కార్యాలయంలో అందించాలని డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా క్రీడా సంఘాల బైలాలు, స్టేట్ అసోసియేషన్ అఫిలియేషన్ పత్రంతో పాటు జిల్లా అసోసియేషన్ గుర్తింపు పత్రాలను గురువారం సాయంత్రం 5 గంటల కల్లా జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మధిర బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

వ్యక్తికి తీవ్ర గాయాలు

మధిర రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మధిరకు చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ నంబూరి రామారావు ద్విచక్రవాహనంపై బ్రిడ్జిపై వస్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో రామారావు రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.

వరకట్న వేధింపుల కేసులో భర్తకు జైలు

బూర్గంపాడు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసు లో భర్తకు ఆరు నెలల జైలుశిక్ష, వెయ్యి రూపాయిల జరిమానా విధి స్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ మంగళవారం తీర్పును వెలువరించారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన చల్లా దుర్గాలావణ్య అనే గృహిణిని తన భర్త నరేష్‌తో పాటు అత్తమామ, ఇరువురు ఆడబిడ్డలు కలిసి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ 2021 అక్టోబరు 1న బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న ప్రథమశ్రేణి న్యాయమూర్తి నిందితుడికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృత్యువాత

టేకులపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో పిడుగుపాటు కు రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. బోడు గ్రామంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి స్థానిక మాడె సంజీవరావుకు చెందిన ఆవు, కేగర్ల నర్సయ్యకు చెందిన ఆవు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడ్డాయి. ఆ రైతులు పశువులను ఎప్పటిలాగే గ్రామ సమీపంలో మేపుతున్నారు. మంగళవారం సాయంత్రం వర్షంతో కూడిన పిడుగు మేస్తున్న రెండు పశువులపై పడింది. వెంటనే ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఆ పశువుల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు తమకు ఆర్థిక సహాయం అందించాలని రైతులు వేడుకొంటున్నారు.

అడవి పందిని వేటాడిన వ్యక్తిపై కేసు

ములకలపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మామిళ్లగూడెం అడవిలో మంగళవారం ఉచ్చులు పెట్టి అడవి పందిని వేటాడి చంపిన వ్యక్తిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అటవీ క్షేత్రాధికారి రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మామిళ్లగూడెం అటవీ ప్రాంతంలో అడవి పందిని వేటాడి చంపినట్లు సమాచారం అందిందని తెలిపారు. సమాచారం అందగానే సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన అడవి పందిని వేటాడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఇతనితో పాటు మరికొంతమంది కలిసి వేటాడినట్లు అదుపులోకి తీసుకున్న వ్యక్తి చిట్టిబాబు తెలిపాడు. ఇతనిపై నమోదు చేశామని అటవీ చట్ట ప్రకారం ఇతనిపై, వేటాడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వన్యప్రాణులను వేటాడద్దని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

అశ్వారావుపేట రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఊట్లపల్లి వైపు నుంచి అశ్వారావుపేటకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. సమాచారం మేరకు ఎస్ఐ యయాతిరాజు భద్రాచలం రోడ్‌లో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

గంజాయి పట్టివేత

బూర్గంపాడు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం బూర్గంపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మేడా ప్రసాద్ మంగళవారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి మోరంపల్లి బంజర గ్రామంలో వాహన తనిఖీ లు చేపట్టారు. ఈసమయంలో ద్విచక్ర వాహనంపై అనుమానస్పదంగా వెళ్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా రూ.4.5లక్షల విలువ చేసే 9.5 కిలోల గంజాయి లభ్యమైంది. సూర్యాపేటకు చెందిన రాంకిషన్ అనే వ్యక్తి ఏపీలోని సీలేరు నుంచి తన గ్రామానికి గంజాయిని తరలిస్తున్నట్లుగా గుర్తించారు. గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్ట్

అశ్వారావుపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ద్విచక్ర వాహనాన్ని చోరీచేసిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ యయాతిరాజు, అఖిల వివరాలు వెల్లడించారు. అశ్వారావుపేటలోని వడ్డెరబజారుకు చెందిన రేపన నాగు అనే వ్యక్తి కొద్దిరోజుల క్రితం అనంతారం గ్రామంలో ఇంటి ఎదుట ఉంచిన ద్విచక్ర వాహనాన్ని చోరీచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదేక్రమంలో ఎస్ఐ అఖిల సిబ్బందితో ఊట్లపల్లి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నాగు ద్విచక్ర వాహనాన్ని ఆపి వివరాలు అడగ్గా చోరీచేసిన వాహనంగా గుర్తించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు.

మేకల దొంగ అరెస్ట్

మేకలను దొంగిలించిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలం ఉసిర్లగూడెంకు చెందిన సున్నం నాగేంద్రబాబు అనే వ్యక్తి మరికొంత మందితో కలిసి మేకలను దొంగిలిస్తుండేవాడు. ఈమేరకు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

రేపు పత్తి మార్కెట్లు బంద్

సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లకు స్లాట్ బుకింగ్స్ వద్దు

గురువారం మార్కెట్ యార్డుకు పత్తి తీసుకు రావద్దు

మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమీక్ష



సమీక్షిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6న పత్తి కొనుగోలు స్లాట్ బుకింగ్ చేసుకోవద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పత్తి కొనుగోళ్లపై మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిన్నింగ్ మిల్ యాజమాన్యం, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 242 మంది రైతుల నుంచి 478 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన పత్తి మద్దతు ధరపై కొనుగోలు చేస్తున్నామన్నారు. తెలంగాణ కాటన్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 6వ తేదీన బంద్ పాటిస్తున్న నేపథ్యంలో రైతులు యాప్‌లో పత్తి అమ్మకం కోసం సీసీఐ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఖమ్మం, ఏన్కూరు మార్కెట్ యార్డులకు పత్తి తీసుకురావద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ. అలీమ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీలు, కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు, సీసీఐ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఏడీఏ వాసవీరాణి, ఆరెంపుల జీఆర్ఆర్ కాటన్ ఇండస్ట్రీస్ గోడవర్తి శ్రీనివాస్, తిరుమలాయపాలెం శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ మిల్ కృష్ణమూర్తి, తల్లాడ స్టేబుల్ రిచ్ కాటన్ ఇండస్ట్రీస్ దుర్గయ్య, మధిర మంజిత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ రాందేవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ మండల కార్యదర్శిగా పగిడికత్తుల



నేలకొండపల్లి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కార్యదర్శిగా నేలకొండపల్లికి చెందిన పగిడికత్తుల నాగేశ్వరరావు తిరిగి ఎన్నికయ్యారు. మంగళవారం నేలకొండపల్లిలో జరిగిన సీఐటీయూ మండల మహాసభలో ఈఎన్నిక జరిగింది. తొలుత సీఐటీయూ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు తుమ్మావిష్ణువర్ధన్ ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మోహనరావు, పాలేరు డివిజన్ నాయకులు బషీరుద్దీన్ మాట్లాడారు. అనంతరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా పగిడికత్తుల నాగేశ్వరరావు, సభ్యులుగా చెరుకు శ్రీను, నాగయ్య, జ్యోతి, ఆంజనేయులు, మైసయ్య, వెంకటలక్ష్మి, రాణిను ఎన్నుకున్నారు.

చెత్త రవాణా మావల్ల కాదు

- పారిశుధ్య వాహనాలు నిలిపి నిరసన తెలిపిన డ్రైవర్లు
- రెండు ట్రిప్పులు వేసేందుకు రాత్రి అవుతోందని ఆవేదన
- ఏడాదిగా డంపింగ్‌యార్డులో సమస్యలు పట్టని అధికారులు
- మేయర్ జోక్యంతో నిరసన విరమణ




నిరసన తెలుపుతున్న డ్రైవర్లు, నిలిచిపోయిన పారిశుధ్య వాహనాలు

ఖమ్మంకార్పొరేషన్,నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పారిశుధ్య నిర్వహణ మరోసారి ప్రశ్నార్థకంగా మారంది. వీధుల వెంట చెత్త సేకరణపై సరిగా నిర్వహించటం లేదని కార్పొరేటర్లు గగ్గోలు పెడుతుండగా, ఇప్పుడు ఏకంగా డంపింగ్‌యార్డుకు రవాణా కష్టాలు ఏర్పడ్డాయి. డంపింగ్‌యార్డులోకి చెత్త రవాణాకు రోజుకు కనీసం రెండు ట్రిప్పులు వేయటానికి రాత్రి 7గంటలైతుందని రవాణా మావల్ల కాదంటూ ఏకంగా ఖమ్మం నగరంలోని 60 డివిజన్ల పారిశుధ్య వాహనాల డ్రైవర్లు నిరసన తెలిపారు. పారిశుధ్య వాహనాలను నిలుపుద చేశారు. దీంతో మేయర్ పునుకొల్లు నీరజ ప్రత్యేకంగా జోక్యం చేసుకొని అధికారులను మందలించి డ్రైవర్లుకు నచ్చజెప్పటంతో తిరిగి రవాణ ప్రారంబమైంది.

2022 నుంచి బయో మైనింగ్

రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో చెత్త నిర్వాహణలో గతంలో ఖమ్మం నగరం ఆదర్శంగా ఉండేది. 2022 నుంచి డంపింగ్‌యార్డులోని చెత్తను బయో మైనింగ్ విధానంలో తొలగించేవారు. 38ఎకరాల్లో ఖమ్మం డంపింగ్‌యార్డు ప్రాంతం ఉండటంతో ఏటా 2లక్షల 70వేల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ ద్వారా రిసైక్లింగ్ చేస్తున్నారు. ఏడాది క్రితం వరకు డంపింగ్‌యార్డు నిర్వాహణ భేష్‌గా ఉందని ఇతర మునిసిపాలిటీ అధికారులు వచ్చి పరిశీలనలు చేశారు.

పర్యవేక్షణలోపంతో రవాణా కష్టాలు

సువిశాలమైన డంపింగ్‌యార్డు అందుబాటులో ఉండగా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయిలోని అధికారులు కనీసం నెలలో ఒక్కసారి కూడా అటువైపు వెళ్లకపోవటమే ఇప్పుడు రవాణా కష్టాలు ఏర్పడ్డాయని ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. నిత్యం డంపింగ్ యార్డుకు వచ్చే చెత్తను సరైన ప్రాంతంలో క్రమపద్దతిలో నిల్వలు ఉంచేందుకు నల్గురు ఉద్యోగులకు బాధ్యతలు కేటాయించారు. ఖమ్మం నగరం నుంచి వచ్చిన చెత్త తరలింపు వాహనాలను క్రమపద్దతిలో చెత్త సేకరించాల్సి ఉంటుంది. గంటకు రూ.2వేలకు పైగా అద్దెలు చెల్లించి వినియోగిస్తున్న 200 మిషన్‌ను నద్వీనియోగం చేసుకోవాల్సి ఉంటుంది. కాని అధికారులు పర్యవేక్షణ జరపకపోవటమే సమస్య ఉత్పన్ననాకి కారణంగా మారింది. వారానికి ఒకసారి అసిస్టెంట్ కమిషనర్లు వెళ్లి డంపింగ్ యార్డును పరిశీలన చేయాల్సి ఉంటుంది. కానీ డంపింగ్‌యార్డులో ఎంతో ఖాళీ స్థలం ఉన్న కూడా చెత్తను ప్రధాన రహదారికి సమీపం లోనే నిల్వలు చేస్తూ ఉండటం సమస్యగా మారింది.సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ నివాసాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

రోజుకు 190 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ

నగరంలోని 60 డివిజన్ల నుంచి ప్రతి రోజు చెత్త సేకరణ జరుగుతుంది. ఇందుకోసం ప్రతి రోజు కేఎంసీ నుంచి 60ట్రాక్టర్లు, 45స్వచ్ఛ భారత్ ఆటోలు, 50 ప్రైయివేట్ ఆటోలు, 11 కమర్షియల్ పారిశుధ్య వాహనాలు చెత్త సేకరణ జరుగుతుంది. రోజుకు 180నుంచి 190 మెట్రిక్ టన్నుల చెత్తను 1వ డివిజన్‌లోని దన్వాయిగూడెంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు.

పారిశుధ్య వాహనాలు నిలుపుదల

డంపింగ్‌యార్డుకు చెత్తను తరలించే పారిశుధ్య వాహనాలు మంగళవారం ఉదయం 5గంటల నుంచే నిలుపుదల చేశారు. ఉదయం 9గంటల వరకు డ్రైవర్లు నిరసనలు తెలిపారు. రోజుకు రెండు ట్రిప్పులు వేయటానికి రాత్రి 7గంటల వరకు సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డు వద్ద కనీసం తాగునీరు సౌకర్యం లేదని వాహనాలు దిగబడితే ఎవ్వరు పట్టించుకోవటం లేదని గతంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడు రాలేదని వాపోయారు. అధికారులు డంపింగ్‌యార్డులో రవాణా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో విషయం తెలుసుకున్న మేయర్ పునుకొల్లు నీరజ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత సమస్య పెరిగే వరకు ఎందుకు స్పందించలేదన్నారు. తర్వాత మేయర్ డ్రైవర్లతో మాట్లాడటంతో నిరసన విరమించారు.

లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు కేటాయింపు

అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ర్యాండమైజేషన్

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలం చిమ్మపూడి గ్రామంలో నిర్మించిన 48 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు గతంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశామని, ప్రస్తుతం వారికి ఇళ్లు కేటాయింపు చేసినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏ లబ్ధిదారుడికి ఏ నెంబర్ ఇళ్లు కేటాయించాలనే అంశం పూర్తిపారదర్శకంగా ఎలాంటి పైరవీలు లేకుండా ఆన్ లైన్ ద్వారా కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, ఈడీఎం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

చేప పిల్లల విడుదలకు కార్యాచరణ రూపొందించాలి

నీటివనరుల్లో చేప పిల్లల విడుదలకు పక్కా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం చేప పిల్లల పంపిణీపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆమె మండల అధికారులతో సమీక్షించారు. చేప పిల్లల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో ఉన్న 882 చెరువులలో ఉచితంగా చేపపిల్లల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 35-40ఎంఎం, 80-100 ఎంఎం సైజ్ చేప పిల్లలు నీటి వనరుల ఆధారంగా విడుదల చేయాలన్నారు. ఎంపీడీఓ, ఇరిగేషన్ ఏఈ, మండల వ్యవసాయ అధికారి, ఫిషరిస్ కో ఆపరేటివ్, ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, మత్స్యకార సంఘాల సభ్యులతో మండల స్థాయి కమిటీలు, పంచాయతీ కార్యదర్శి, ఏఈఓ, ఫిషరీస్ కో ఆపరేటివ్ సభ్యులతో గ్రామకమిటీలను గురువారం నాటికి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ మండలంలో ఉన్న నీటి వనరులలో వేసే చేపపిల్లల పంపిణీ వివరాలు టీ-మత్స్యయాప్‌లో నమోదు చేయాలన్నారు.ఈసమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత,వ్యవసాయశాఖ ఏడీఏలు, నీటి పారుదలశాఖ అధికారులు, ఎంపీడీఓ లు, మత్స్య శాఖ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి

జిల్లాలో అన్నిప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు రాబోయే 10వతరగతి, ఇంటర్ పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా పని చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల పనితీరుపై ఆమె అధికారులు,కేజీబీవీ, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్స్, కాంప్లెక్ హెడ్ మాస్టర్లు, ఎంఈఓలతో సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్, అపార్, ఆధార్‌కార్డు, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత, తదితర అంశాలపై ఆమె సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు.విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వారానికి రెండుసార్లు ఫోన్ చేసి పిల్లల చదువుపై ఫాలో అప్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెడ్ మాస్టర్ల హ్యాండ్ బుక్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లాఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, కళాశాల ప్రిన్సిపల్స్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ



ర్యాండమైజేషన్ ద్వారా ఇందిరమ్మ ఇంటిని కేటాయిస్తున్న అధికారులు

అఖండ హరినామ సంకీర్తన

అన్నం సేవా ఫౌండేషన్‌లో మార్మోగిన హరేరామ స్మరణ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినము సందర్భంగా అవధూతేద్ర భక్తమండలి సమాజం గొట్టిపర్తి శివాజీ గురువు భక్తబృందం అధ్వర్యంలో మంగళవారం నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో అఖండ హరినామ సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ అండ్ ఫౌండర్ అన్నం శ్రీనివాసరావు, షేక్ నాగుల్ మీరా, ఎకోక్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ కడవెండి వేణుగోపాల్ పాల్గొన్నారు .



4కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఖమ్మం 1టౌన్ ఎక్సైజ్‌శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపారు. సీఐబీ.కృష్ణ వివరాల ప్రకారం.. ఓడిస్సా రాష్ట్రానికి చెందిన ఉమాకాంత్ నాగులు అక్రమంగా 4కేజీల ఎండుగంజాయిని హైదరాబాద్‌కు బస్సులో రవాణా చేస్తున్నాడు. ఈక్రమంలో కొత్త బస్టాండ్ వద్ద ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఉమాకాంత్ నాగులు అనుమానస్పదంగా కనిపించారు. అతడిరి అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా కేజీల ఎండు గంజాయి లభించింది. తనిఖీల్లో ఎస్ఐ రేష్మ సుల్తానా, సాయిబాబా సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడితో ఎక్సైజ్‌శాఖ అధికారులు

క్యారమ్స్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల1,2తేదీల్లో నగరంలోని మేధాన్స్ క్యారమ్స్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన పట్టణస్థాయి క్యారమ్స్ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. సింగిల్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన రాంబాకు రూ.10వేలు, ద్వితియ బహుమతి సాధించిన కృష్ణకు రూ.5వేలు,తృతీయబహుమతి సాధించిన శ్యామ్ కురూ.3వేలు,డబుల్స్‌విభాగంలోప్రథమ బహుమతి సాధించిన ద్వారక, మల్సూర్ జోడీకి రూ.10వేలు, ద్వితియ బహుమతి సాధించిన గోవింద్, కృష్ణకు రూ.6వేల నగదు బహుమతులను నిర్వాహకులు కూచుపుడి శ్రీనివాస్, సంజయ్ అందించారు. కార్యక్రమంలో జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందచేస్తున్న నిర్వాహకులు

నగరంలో సీపీఎం నిరసన ర్యాలీ

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకులు సామినేని రామారావు హత్యపై పోలీసులు న్యాయబద్ధమైన విచారణ సాగతపోతే పోలీసు కార్యాలయాలు ముట్టడి చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు హెచ్చరించారు. సామినేని రామారావు హత్య జరిగి ఐదు రోజులు గడిసిన పోలీసు కేసులో పురోగతి లేదని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ, నాగుల్‌మీరా. బోడపట్ల సుదర్శన్, భూక్య శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు, వై విక్రమ్, ఎస్ నవీన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మీరా సాహెబ్, ప్రసాద్, మెరుగు సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: బస్టాండ్‌సెంటర్‌లోని రసనకారులు ఆందోళనచేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, టి.నాగేశ్వరావు, వి.వీరన్న, బి.రమేష్, ఎ.నరసయ్య, కెస్వామి,లింగస్వామి, ధర్మాచారి తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో ప్రైవేట్ పెత్తనం!

(5వ పేజీ తరువాయి)

కంప్యూటర్ అపరేటర్లుకు ఒక్కో దరఖాస్తుకు కొద్ది పాటి డబ్బు ఆశగా చూపి తాము తీసుకొచ్చిన వీధి వ్యాపారుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయిస్తున్నారు. దీంతో వివాదాలు ఏర్పడుతున్నాయి. మంగళవారం ఇలాంటి సంఘటనే చోటు చేసుకొంది. మామిళ్లగూడెం నుంచి వచ్చిన ఓ ప్రైవేట్ మహిళ నేరుగా కార్యాలయంలోకి వెళ్లి ఆన్‌లైన్ చేయిస్తుండటంతో ఆర్పీల సంఘం అధ్యక్షురాలు వెళ్లి అధికారులను నిలదీశారు.

అర్హత లేని వారికి స్వనిధి

మెప్మా ఆర్పీల ఆధ్వర్యంలో స్వనిధి రుణాలను మంజూరు చేస్తే తిరిగి బ్యాంకర్లకు చెల్లింపుల సమయంలో రికవరీకి అవకాశం ఉంటుంది. కానీ ప్రైవేట్ వ్యక్తులు మాత్రం వీధుల వెంట వ్యాపారాలు చేయని వారిని పిల్ల తల్లులను, తీసుకొచ్చి వీధుల వెంట అరిటిపండ్లు, కొబ్బరి బొండాలు దుకాణాలు ఎదుట ఫొటోలు తీయిస్తున్నారు. ఆ ఫొటోలను తీసుకొచ్చి ప్రధానమంత్రి స్వనిధి రుణాలను ఇప్పస్తున్నారని ఆరోపణలున్నాయి. నకిలీ వీధి వ్యాపారులకు రుణాలివ్వటం ద్వారా భవిష్యత్‌లో బ్యాంకర్లకు రికవరీ ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఇది ఇబ్బందిగా మారనున్నది.

పోరాటాలతోనే కార్మికుల హక్కులు

- టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రామయ్య

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ డీవీ కృష్ణన్న, రామారావు, నెల్లిమర్ల వంటి ఎందరో అమరవీరుల ఆత్మ బలిదానాలు ద్వారానే ఇప్పుడు కార్మికులు ఎన్నో హక్కుల్ని కలిగి ఉన్నారని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య గుర్తు చేశారు. మంగళవారం ఖమ్మంలోని పరిశ్రమల ప్రాంతంలో అమరవీరుల సంతాప సభను నిర్వహించారు. భూమి కోసం, భుక్తి కోసం, కార్మికుల హక్కుల కోసం అమరణ నిరాహార దీక్షలు చేసిన అమరవీరులను స్మరించారు. దశాబ్దాలుగా కార్మికులు అమరణ నిరాహార దీక్షలు చేయటంతోనే 8గంటల పనివిదానం నుంచి అనేక పథకాలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించటంతో కార్మికుల హక్కులు అమలు కావటం లేదన్నారు. అమరవీరుల స్ఫూర్తితో కార్మికులు ఉద్యమాలు చేసి లేబర్ కోడ్‌లను రద్దు జరిగి తిరిగి కార్మిక చట్టాలు అమలు జరిపే వరకు పోరాటాలు ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు.నాయకులు లక్ష్మీనారాయణ, బొమ్మకంటి రమేష్, బజార్,వెంకన్న,శ్రీను, రాము, శంకర్, సైదులు, కోటి నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రామయ్య

ప్రజావాణి సమస్యను పరిష్కరించిన మేయర్

హర్షం వ్యక్తం చేసిన వృద్ధ దంపతులు

ఖమ్మంకార్పొరేషన్,నవంబరు4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాదు.. ప్రజావాణి సమస్యలు కూడా పరిష్కారం చూపుతామని నిరూపించారు మేయర్ పునుకొల్లు నీరజ. ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్‌కు చెందిన వృద్ధదంపతులు 7ఏళ్ల క్రితం ఇళ్లు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ జరిగింది కానీ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పేరు మార్పు కాలేదు. పేరు మార్పిడి(మ్యూటేషన్) కోసం ఏడాదిగా కేఎంసీ కార్యాలయం చుట్టూ ప్రదీక్షణలు చేస్తున్నారు. రెవెన్యూ ఆఫీసర్ యాకూబ్‌పాషా, ఆర్ఐ నాగరాజు, వార్డు ఆఫీసర్ సంధ్య వెళ్లి ఇంటి పరిశీలన చేశారు. కానీ పేరు మార్పిడి కాలేదు. దీంతో ఆ వృద్ధ దంపతులు సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజావాణిలో మేయర్ పునుకొల్లు నీరజకు సమస్యను వివరించారు. తిరిగి మంగళవారం మేయర్ చాంబర్‌కు వచ్చారు. రెవెన్యూ అధికారులను పిలిపించిన మేయర్ పునుకొల్లు నీరజ పేరు మార్పిడి పనులు చేయించారు. దీంతో వృద్ధ దంపతులు హర్షం వ్యక్తం చేశారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ నీరజ

నిత్యవసరాలు పంపిణీ

మున్నేరు పరివాహకంలో ఇటీవల వరద ఉధృతి ముంపునకు గురైన బాధితులకు మేయర్ పునుకొల్లు నీరజ నిత్యవసరాలు పంపిణీ చేశారు. 40వ డివిజన్‌లోని కాల్వొడ్డు, బొక్కలగడ్డ పలుప్రాంతాల్లో సరుకుల బ్యాగ్‌లను బాధితుల నివాసాలకు వెళ్లి అందించారు. ఏఎంసీఅనిల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులకే ప్రాధాన్యత

ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామారావు

సత్తుపల్లిరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా వీలైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ కాన్పులకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఎన్‌సీడీ జిల్లాప్రోగ్రామ్ ఆఫీసర్ డీ.రామారావు అన్నారు. మంగళవారం ఆయన సత్తుపల్లిలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ..ఈనెల7న నేషనల్ క్యాన్సర్ అవేర్‌నెస్ డే, నవంబరు 14న నేషనల్ డయాబెటిస్ అవేర్‌నెస్ నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పేద ప్రజల కోసం అందుబాటులోని వైద్యశాలల్లో కాన్పులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని,వైద్యులు అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. డెంగీ, విషజ్వరాల ఉధృతి ఈ ప్రాంతంలో లేవని, వర్షాలు తగ్గిన తర్వాత ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం తగ్గిందన్నారు.

వీరుల త్యాగాలు వెలకట్టలేనివి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ

సత్తుపల్లి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, విముక్తి కోసం, కులం, మతం, దోపిడీ, పీడన, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ సమాజం కోసం పోరాడిన వీరుల త్యాగాలు వెలకట్టలేనివి అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.పృథ్వీ అన్నారు. పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభల సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలో విద్యార్థులు భారీర్యాలీ నిర్వహించి స్థానిక నీలం రామచంద్రయ్య భవనం వద్ద జెండావిష్కరించారు. దేశానికి ప్రమాదకరంగా మారుతున్న కుల, మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకునేందుకు విద్యార్థులు శాస్త్రీయ దృక్పధాన్ని అలవర్చుకొని ప్రగతిశీల భావజాల ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. విప్లవకారులు మరణించినప్పటికీ ప్రజా పోరాటాల్లో చిరస్థాయిగా జీవిస్తారన్నారు. భారత పార్లమెంటరీ పాలనకు 78ఏళ్లు గడిచినా ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలిచావులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పరపు లక్ష్మణ్, వంగూరి వెంకటేష్, ఆవుల అశోక్, ఏ.వెంకన్న, శ్రీనివాసరావు, బీరెల్లి లాజర్, గంటా శ్రీనివాస్, అమర్లపూడి శరత్, శశి, పాషా, యశ్వంత్, అశోక్, శ్రీను, వెంకటేష్, సుశాంత్, హరి, సాదిక్ పాల్గొన్నారు.



సత్తుపల్లిలో జెండావిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రైతులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ జిల్లా నాయకుడు కొండబాల కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో పంటలు నష్టపోయిన పత్తిచేలను టీడీపీ బృందం పరిశీలించింది. తుఫాన్ రైతాంగానికి కోలుకోలేని దెబ్బతీసిందని, వేలాదిరూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే తుఫాన్ నిండా ముంచిందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనావేసి ఎకరానికిరూ.30వేలు చెల్లించాలన్నారు. పత్తికి రూ.15వేలు, మిర్చికి రూ.20వేలు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ఈకార్యక్రమంలో కొప్పుల వెంకటరావు,నామాప్రసాద్,మల్లీడి రమేష్, కొలిశెట్టి బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కూసుమంచి,నవంబరు4(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలకేంద్రంలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, మండల అధికారులు జాతీయ జండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. కూసుమంచి తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో జశ్వంత్‌కుమార్, ఎస్ఐ నాగరాజు, మండలవైద్యాధికారి సాయికుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావద్దని, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వలన సమాజంలో విలువలు కోల్పోతారని,తల్లితండ్రులను సమాజంలో తలెత్తుకోలేనంత ఇబ్బందులు పడుతారని తెలిపారు.డ్రగ్స్‌సమాచారం తెలిసినా సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్లోబల్ కరస్పాండెంట్ ఎర్షాద్, కూసుమంచి హెచ్ఎం జుబేదాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగదు రహిత లావాదేవిలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని సీఆర్‌పీ అనిత అన్నారు. మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలో మంగళవారం ఐకేపీ తరపున విఓఏలు, విఓలకు మదర్‌థెరిస్సా గ్రామ సమైక్యలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళ సభ్యులు తమ ఇంటి నుంచే డిజిటల్ విధానంలో నగదు లావాదేవిలు నేరుగా జరుపుకోవచ్చునన్నారు. సమయం ఆదా, సురక్షిత చెల్లింపులు ఏ సయమంలో అయినా సెల్ ఫోన్ ద్వారా జరుపుకోవచ్చునని వివరించారు. గ్రామసమైక్యలలో, సమైక్య లీడర్లకు, గ్రూపు లీడర్లకు సభ్యులకు అవగాహన కార్యక్రమాలు ఈనెల చివరిలోపు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఏన్కూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్, అకాలవర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు కోరారు. మంగళవారం ఏన్కూరులో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాలవర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాలతో పత్తి పంటకు పూర్తిగా నష్టం జరిగిందన్నారు. సీపీఐ ఏర్పడి వందేళ్ల అయిన సందర్భంగా డిసెంబరులో ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్, జిల్లాసమితి సభ్యులు అమరనేని వీరభద్రం, మండల సహాయ కార్యదర్శి బానోతు రాంబాబు, వెంకన్న, బోగినబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీరుల త్యాగాలు వెలకట్టలేనివి

▸ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ


సత్తుపల్లిలో జెండావిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సత్తుపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, విముక్తి కోసం, కులం, మతం, దోపిడీ, పీడన, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ సమాజం కోసం పోరాడిన వీరుల త్యాగాలు వెలకట్టలేనివి అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.పృథ్వీ అన్నారు. పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభల సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక నీలం రామచంద్రయ్య భవనం వద్ద జెండావిష్కరించారు. దేశానికి ప్రమాదకరంగా మారుతున్న కుల, మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకునేందుకు విద్యార్థులు శాస్త్రీయ దృక్పధాన్ని అలవర్చుకొని ప్రగతిశీల భావజాల ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. విప్లవకారులు మరణించినప్పటికీ ప్రజా పోరాటాల్లో చిరస్థాయిగా జీవిస్తారన్నారు. భారత పార్లమెంటరీ పాలనకు 78ఏళ్లు గడిచినా ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలిచావులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పరపు లక్ష్మణ్, వంగూరి వెంకటేష్, ఆవుల అశోక్, ఏ.వెంకన్న, శ్రీనివాసరావు, బీరెల్లి లాజర్, గంటా శ్రీనివాస్, అమర్లపూడి శరత్, శశి, పాషా, యశ్వంత్, అశోక్, శ్రీను, వెంకటేష్, సుశాంత్, హరి, సాదిక్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు, ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

వైరా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు యాజమాన్యం, వరి ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని వైరా ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ సూచించారు. మంగళవారం వైరాలోని రైతువేదికలో జరిగిన రైతునేస్తం, ఆయిల్‌పామ్ సాగు యాజమాన్యం, వరి ధాన్యం కొనుగోళ్ల అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తుందని, కచ్చితమైన ఆదాయం ఈ పంట ద్వారా లభిస్తుందని తెలిపారు. ఎలాంటి కూలీలు అవసరం లేకుండా ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు సూచించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవోలు ఎస్.సైదులు, వాసంతి, కీర్తి, రాజేష్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా అడ్డగింత

వైరా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకొడిమలో ఉన్న గుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. మంగళవారం గుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న సమాచారాన్ని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు గ్రామస్థులు తెలిపారు. ఆతర్వాత తహసీల్దార్ సూచనలతో మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్న గ్రామస్థులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

▸ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెనుబల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు పత్తి, వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్‌కు మంగళవారం రైతులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. పత్తి రైతుకు విత్తనాల దగ్గరి నుంచి ఎరువులు, పురుగులమందులు, కల్తీకితోడు అధిక వర్షాలు కురవడంతో పంట చేతికి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎలాంటి నాణ్యతాప్రమాణాలు లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరకు సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుసంఘం మండల అధ్యక్షుడు చిట్టిమోదుల కృష్ణ, కార్యదర్శి నల్లమల అరుణ్‌ప్రతాప్, చలమాల విఠల్ రావు, గాయం తిరుపతిరావు, తడికమళ్ల చిరంజీవి, చమటా విశ్వనాథం, కంటే సత్యం పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

తల్లాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని ప్రైవేటు ఆస్పత్రిని మంగళవారం సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో రామారావు తనిఖీచేశారు. స్థానిక శ్రీసాయి బాలాజీ నర్సింగ్‌హోంను ఆయన తనిఖీచేసి ఆస్పత్రి నిర్వాహణకు అవసరమైన అన్ని సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధులు వస్తున్న తరుణంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ మహేష్, హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, డాక్టర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

▸ సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి


కల్లూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరులో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు ఒక అవగాహనకు వచ్చారన్నారు. పసుమర్తి చందర్‌రావు, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, భూక్యా శివకుమార్‌నాయక్, ముకర విజయరావు, దామాల రాజు, బాలశౌరి, మచ్చా వెంకటేశ్వరరావు, బైర్ల కాంతరావు పాల్గొన్నారు.

హరీష్‌రావును కలిసిన మండల నాయకులు

ఏన్కూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌పార్టీ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును మంగళవారం హైదరాబదులో ఆయ ననివాసంలో ఏన్కూరు మండలం నాయకులు కలిశారు. తండ్రి మృతినేపథ్యంలో హరీష్‌రావును పరామర్శించారు.ఈసందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో దిశ కమిటీ సభ్యుడు బాదావత్ బాలాజీ, మాజీ ఎంపీటీసీ వాసిరెడ్డి వెంకటేశ్వర్లు,తాజామాజీ సర్పంచ్‌లు భూక్యా శివ, భూక్యా బాలాజీ, నాయకులుపూర్ణకంఠ నాగరాజు, కూరాకుల వెంకటేశ్వర్లు, భూక్యా వెంకన్న పాల్గొన్నారు.

మెప్మాలో ప్రైవేట్ పెత్తనం!

(5వ పేజీ తరువాయి)

కంప్యూటర్ ఆపరేటర్లుకు ఒక్కో దరఖాస్తుకు కొద్ది పాటి డబ్బు ఆశగా చూపి తాము తీసుకొచ్చిన వీధి వ్యాపారుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయిస్తున్నారు. దీంతో వివాదాలు ఏర్పడుతున్నాయి. మంగళవారం ఇలాంటి సంఘటనే చోటు చేసుకొంది. మామిళ్లగూడెం నుంచి వచ్చిన ఓ ప్రైవేట్ మహిళ నేరుగా కార్యాలయంలోకి వెళ్లి ఆన్‌లైన్ చేయిస్తుండటంతో ఆర్పీల సంఘం అధ్యక్షురాలు వెళ్లి అధికారులను నిలదీశారు.

అర్హత లేని వారికి స్వనిధి

మెప్మా ఆర్పీల ఆధ్వర్యంలో స్వనిధి రుణాలను మంజూరు చేస్తే తిరిగి బ్యాంకర్లకు చెల్లింపుల సమయంలో రికవరీకి అవకాశం ఉంటుంది. కానీ ప్రైవేట్ వ్యక్తులు మాత్రం వీధుల వెంట వ్యాపారాలు చేయని వారిని పిల్ల తల్లులను, తీసుకొచ్చి వీధుల వెంట అరటిపండ్లు, కొబ్బరి బొండాలు దుకాణాలు ఎదుట ఫొటోలు తీయిస్తున్నారు. ఆ ఫొటోలను తీసుకొచ్చి ప్రధానమంత్రి స్వనిధి రుణాలను ఇప్పిస్తున్నారని ఆరోపణలున్నాయి. నకిలీ వీధి వ్యాపారులకు రుణాలివ్వటం ద్వారా భవిష్యత్‌లో బ్యాంకర్లకు రికవరీ ఇబ్బందులు తలెత్తనున్నాయి.

ఏసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ వేడుకలు



కొణిజర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైరా డీనరి పరిధిలోని వివిధ విచారణలతో కలిసి ఏసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ వేడుకలను కొణిజర్ల మండలం తనికెళ్లలోని పునీత అలోసియస్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాల ఆవరణలో బుధవారం ప్రారంభమవుతాయని వైరా డీన్ ఫాదర్‌తుంపాటి అగస్టీన్ మంగళవారం తెలిపారు. వేడుకలకు వైరా డీనరీలోని పాత వైరా విచారణ, రెబ్బవరం విచారణ, దాచాపురంవిచారణ, బోస్కో నగర్ విచారణ, తల్లాడవిచారణ,లు కలిసి ఐక్యంగా నిర్వహిస్తున్నాయని ఆయన తెలిపారు. వేడకలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

సామినేని హత్యపై సమగ్ర విచారణ జరపాలి : సీపీఎం

▸ రామారావు హత్యను పక్కదారి పట్టించే ప్రయత్నం ▸ సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు


చింతకానిలో ర్యాలీలో సీపీఎం శ్రేణులు

సత్తుపల్లిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ గుండాల చేతుల్లో హత్యకు గురైన కామ్రేడ్ సామినేని రామారావు హత్యపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని సీపీఎం సత్తుపల్లి పట్టణ, మండల కమిటీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలో నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల సహకారంతోనే రామారావు హత్య జరిగిందని, హత్య వెనుకనున్న కుట్రదారులతో పాటు హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండు, కొలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, జాజిరి జ్యోతి, బాల బుచ్చయ్య, చావా రమేష్, వలీ, భాస్కర్, జిలానీ, సైదా, రాము, కావూరి వెంకటేశ్వరరావు, కోటయ్య, అర్జున్, భాష, మీరాజ్, శివాజీ పాల్గొన్నారు.

చింతకాని: చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావుని హత్య చేసిన హంతకులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అండ ఉందని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. సామినేని రామారావు హత్యను ఖండిస్తూ మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. సామినేని రామారావు హత్య జరిగి నేటికి ఐదు రోజులు అవుతున్న పోలీసుల విచారణలో ఎటువంటి పురోగతి లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రామారావుది రాజకీయ హత్య కాదని కాంగ్రెస్ నాయకులు పదేపదే ఆరోపణలు చేయడంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాతర్లపాడులో కాంగ్రెస్ గెలవదని నిర్ధారణ కావడంతోనే రామారావుని కాంగ్రెస్ గుండాలు హత్య చేశారన్నారు. కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి రెండు రోజుల్లో హంతకులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, గడ్డం కోటేశ్వరరావు, ఆలస్యం రవి, దొడ్డ చందర్‌రావు, మాదినేని రవి, నకనబోయిన శాంతారావు, కాటబత్తిన వీరబాబు, ఓబెనబోయిన అచ్చయ్య, బయ్య శ్రీను, మడుపల్లి కిరణ్, జల్లి పుల్లయ్య పాల్గొన్నారు.

పెనుబల్లి: సీపీఎం నాయకుడు సామినేని రామారావు కాంగ్రెస్ గూండాల చేతుల్లో హత్యకు గురయ్యారని, పోలీసులు సమగ్ర విచారణ జరిపి దోషులను వెంటనే శిక్షించాలని సీపీఎం ఆధ్వర్యంలో వీఎంబంజర్‌లో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల సహకారంతోనే రామారావు హత్య జరిగిందని, హత్య వెనుక ఉన్న కుట్రదారులతోపాటు హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు ఎటువంటి రాజకీయ వత్తిళ్లకు తలొగ్గకుండా దోషులను అరెస్టు చేయాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేస్తున్నది ప్రజాపాలన అయితే కేసు విచారణకు సహకరించి దోషులను కఠినంగా శిక్షించేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. మధిర నియోజకవర్గంలో నాడు మార్కిస్టు అధికారంలో ఉన్న రోజుల్లో ప్రజాస్వామ్యం వెల్లువిరిసిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టులతోపాటు ప్రత్యర్థులను హత్య చేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా మారడం దురదృష్టకరమన్నారు. సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతి రావు, తడికమళ్ల చిరంజీవి, చిట్టిమోదుల కృష్ణయ్య, మిద్దే స్వామి పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం, పండ్లు అందజేత


వృద్ధులకు బియ్యం అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పెనుబల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లి శ్రీరామా సేవాసంస్థ ఆధ్వర్యంలో వీఎంబంజర్‌లోని వృద్ధులకు బియ్యం, పండ్లను తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులకు ఆహారాన్ని అందించేందుకు కృషిచేస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు యర్రగొర్ల వెంకటేశ్వర్లు, కోమటి రవి, వంగా గిరిజాపతిరావు, మందా వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి రాజేశ్వరరావు, పుల్లయ్య పాల్గొన్నారు.

సీసీఐ నిబంధనలను మార్చాలి

▸ జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్


సీసీఐలో పత్తిని పరిశీలిస్తున్న కమల్‌రాజ్

మధిర రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనలను మార్చాలని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ డిమాండ్ చేశారు. మధిర మండలం ఖాజీపురం వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐ కొనుగోలు కేంంద్రం ఏర్పాటుచేయడం వల్ల రైతులకు పెద్దగా ఉపయోగం లేకుండా పోయిందని, వారంరోజుల్లో కేవలం 180క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారన్నారు. రైతులకు ఉపయోగపడేవిధంగా సీసీఐ నిబంధనలను మార్చాలని కోరారు. రైతులు స్లాట్ బుక్ చేసుకునే విధానం, తేమ శాతం పరీక్ష కేంద్రాలు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఉండేవని ఇప్పుడు అదే విధానాన్ని కొనసాగించాలని, ఎకరాకు ఏడు క్వింటాళ్లు కొనడం అనే సీలింగ్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, నాయకులు చావా వేణు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, వీరారెడ్డి, మేడిశెట్టి నాగేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, వెంపటి నాగేశ్వరరావు, అమరవాది కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇసుక రవాణపై నిఘా పెంచండి

ఎర్రుపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామంలో ఇసుక రీచ్‌వద్ద అధికారుల నిఘా పెంచాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మంగళవారం తహీసల్దార్ మన్నె ఉషాశారదకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంతా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక పేరుతో ఎక్కువగా ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నాయని 22గ్రామాలకు చెందిన లబ్ధిదారులందరు మీనవోలు రీచ్‌వద్దకే వస్తున్నారని తెలిపారు. ఒకే రీచ్‌కు ఇసుక కూపన్లు కేటాయించడంతో ఇసుక ట్రాక్టర్లు తాకిడి ఎక్కువగా ఉందని ఇదే అదునుగా చూసుకుని అక్రమార్కులు చొరబడుతున్నారని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణ జరగకుండ అధికారులు నిఘా పెంచాలని కోరారు. మండలంలోని మీనవోలు మినహా మిగిలిన ఇసుక ర్యాంపులలో నీరు ప్రవహించడంతో ఇసుక తరలింపు సాధ్యంకావడంలేదని, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత రాకూడదని, మీనవోలు రీచ్‌కు కూపన్లు జారీచేసినట్టు తహసీల్దార్ వివరణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీనాయకులు, మాజీ మండల అధ్యక్షుడు సెగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు కుడుముల మల్లిఖార్జున్‌రెడ్డి, యరమల కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు ఇన్ని ఆంక్షలా?


మహాసభలో ప్రసంగిస్తున్న బొంతు రాంబాబు

వైరా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి పత్తి కొనుగోళ్లకు సీసీఐ విధించిన నిబంధనలపై తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి కొనుగోళ్లకు సీసీఐ నిబంధనల పేరిట ఇన్ని ఆంక్షలా అంటూ నిలదీశారు. మండలంలోని విప్పలమడకలో మేడా శరాబందీ అధ్యక్షతన మంగళవారం జరిగిన తెలంగాణ రైతు సంఘం మండల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతు సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లకు విధించిన నిబంధనలను సులభతరం చేసి వెంటనే రైతుల పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జెండాను సీనియర్ నాయకుడు నల్లమల కోటేశ్వరరావు ఎగురవేశారు. విప్పలమడక, లింగన్నపాలెం మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, తోటకూర బాబూరావు, నీటిసంఘం మాజీ చైర్మన్ కొల్లా వెంకటేశ్వరరావు, రైతుసంఘం మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, నాయకులు బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, షేక్.మోహిద్దీన్, గరిడేపల్లి సుబ్బారావు, మాగంటి తిరుమలరావు, బాణాల కృష్ణమాచారి, షేక్.జాన్‌మియా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులకే ప్రాధాన్యం

▸ రోజూ 20నిమిషాలు వ్యాయామం చేయాలి
▸ ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామారావు


సత్తుపల్లిలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎన్‌సీడీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రామారావు

సత్తుపల్లిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా వీలైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ కాన్పులకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డీ.రామారావు అన్నారు. మంగళవారం ఆయన సత్తుపల్లిలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 7న నేషనల్ క్యాన్సర్ అవేర్‌నెస్ డే, నవంబర్ 14న నేషనల్ డయాబెటిస్ అవేర్‌నెస్ నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పేద ప్రజల కోసం అందుబాటులోని వైద్యశాలల్లో కాన్పులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, వైద్యులు అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. డెంగీ, విషజ్వరాల ఉధృతి ఈ ప్రాంతంలో లేవని, వర్షాలు తగ్గిన తర్వాత ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం తగ్గిందన్నారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామని, టీబీ ఉన్నవాళ్లు హెచ్‌ఐవీ, డయాబెటిస్ టెస్టులు చేయించుకోవాలన్నారు.

రోజూ 20నిమిషాలు వ్యాయామం చేయాలి

మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆత్మనూన్యత భావంతో ఎక్కడో ఒక్కచోట ఆత్మహత్యలు చేసుకునేవారని, కానీ ఇప్పుడు పెరిగిపోయాయని, ఈ క్రమంలో డిప్రెస్‌న్‌కు లోనుకాకుండా విద్యార్థి దశనుంచే అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ చిన్నాపెద్దా తేడాలేకుండా కనీసం 20నిమిషాల పాటు వ్యాయామం చేసినట్లయితే భవిష్యత్తులో అనారోగ్యాల బారిన పడకుండా దోహదపడుతుందన్నారు. టీనేజీ గర్ల్స్ కూడా ఎక్సర్‌సైజ్ తప్పకుండా చేయాలని, పీసీఓబీ, మెన్సస్ సమయంలో కడుపులో నొప్పి రాకుండా ఉంటుందని, యుక్తవయస్సు దాటిన తర్వాత పూర్తి ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. పెంపుడు, వీధి కుక్కలు కరిస్తే అశ్రద్ధ చేయవద్దని, రేబీస్ సోకి ప్రాణానికే ప్రమాదమన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాలలో కుకింగ్ చేస్తున్న సుమారు 1100మందికి పరీక్షలు చేయిస్తున్నామని, రోగ నిర్ధారణ జరిగితే ముందుగానే చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. వారసత్వంగా వచ్చే సికిల్ సెల్ వ్యాధి ఉన్నట్లయితే రేపొద్దున పుట్టబోయే పిల్లలకు సైతం సోకే వచ్చే అవకాశం ఉందని, అందుకే ముందుగానే గుర్తించి హైడ్రోక్సీ యూరియా డ్రగ్ ఇచ్చి నిర్మూలించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పోగాకు, గంజాయి విషయంలో పాఠశాలల్లో వచ్చేనెల 10వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 100మీటర్ల లోపులో పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి విషయంలో విద్యార్థుల పట్ల తల్లీదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, ముందుగానే గుర్తించి వారి భవిష్యత్తును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.అవినాష్, క్లస్టర్ సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యూకేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్లే

▸ జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్


సత్తుపల్లి కోర్టులో మాట్లాడుతున్న మారగాని శ్రీనివాస్

సత్తుపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలు, భార్యభర్తలు, చెక్‌బౌన్స్ తదితర కేసులు ఎక్కువ రోజులు కోర్టుల్లో పెండింగ్ ఉంచుకోకుండా.. లోక్ అదాలత్ ద్వారా రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్లేనని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సత్తుపల్లి కోర్టులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్ఐ యాక్ట్, క్రిమినల్, చెక్‌బౌన్స్ మెయింటెనెన్స్, గృహహింస చట్టం, ప్రమాద బీమా క్లెయిమ్, సివిల్, వైవాహిక, వినియోగదారుల, ఆస్తి విభజన, భూమి, కుటుంబ వివాదాలు రాజీకి పరిష్కారానికి యోగ్యమైన క్రిమినల్ కేసులను స్పెషల్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా డబ్బు, సమయం ఆదా అవుతుందని, కేసులు ఉండి న్యాయవాదిని నియమించుకోలేని స్థితిలో ఉన్న పేదవారికి, న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. సీనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.మీరాఖాసీంసాహెబ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ బీఎస్ఎస్.సుమబాల, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ వీ.లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపూల వెంకటేశ్వరరావు, సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, బ్యాంకర్లు, ఫైనాన్స్, చిట్‌ఫండ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగదు రహిత లావాదేవిలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని సీఆర్‌పీ అనిత అన్నారు. మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలో మంగళవారం ఐకేపీ తరపున విఓఏలు, విఓలకు మదర్‌థెరిస్సా గ్రామ సమైక్యలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. మహిళ సభ్యులు తమ ఇంటి నుంచే డిజిటల్ విధానంలో నగదు లావాదేవిలు నేరుగా జరుపుకోవచ్చునన్నారు. సమయం ఆదా, సురక్షిత చెల్లింపులు ఏ సయమంలో అయినా సెల్‌ఫోన్ ద్వారా జరుపుకోవచ్చునని వివరించారు. నగదు రహిత లావాదేవిలపై అన్ని గ్రామ సమైక్యలలో, సమైక్య లీడర్లకు, గ్రూపు లీడర్లకు సభ్యులకు అవగాహన కార్యక్రమాలు ఈ నెల చివరిలోపు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైక్యలు, గ్రామ దీపికలు వేము నాగమణి, జ్యోతి; రజిత, కళావతి, వెంట్రావమ్మ, మల్లికా పాల్గొన్నారు.